News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 02 | సంచిక :134 | ఖమ్మం | మంగళవారం, జూలై 2, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

అమ్మో... ఒకటో తారీఖు కాదు! ఇది... ఆహా ఒకటో తారీఖు! అవ్వా తాతల మోములో 'పెంచిన పింఛను' వెలుగులు నింపిన రోజు! సోమవారం తెలతెలవారగానే ప్రత్యక్షమైన సచివాలయ సిబ్బంది... తలుపుతట్టి మరీ పింఛను అందించారు. మూడు నెలల బకాయి రూ.3వేలు, ఈ నెల పింఛను రూ.4వేలు కలిపి మొత్తం 7వేలు చేతికిచ్చారు. ఉదయం నుంచి రాత్రి దాకా నిరాటంకంగా పెన్షన్ పంపిణీ ప్రక్రియ సాగింది. ఇక... ఉద్యోగపర్వంలోనూ కొత్త అధ్యాయం మొదలైంది. నాలుగున్నరేళ్లుగా పదో తేదీ దాటినా పడని జీతాలు నేడు ఒకటో తేదీనే బ్యాంకు ఖాతాల్లో పడిపోవడం... మొబైల్ ఫోన్లో 'క్రెడిటెడ్' మెసేజ్‌లు టింగుటింగుమని మోగడంతో ఉద్యోగులు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. రాష్ట్రంలోని అత్యధిక శాతం ఉద్యోగులకు సోమవారమే జీతాలు పడ్డాయి. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లూ పడటం మొదలైంది. ఉపాధ్యాయులకు, మిగిలిన వారికీ మంగళవారం జీతాలు, పెన్షన్లు జమ కానున్నాయి. సుమారు 62 లక్షల మందికి సామాజిక పింఛన్లు, దాదాపు 10 లక్షలమందికిపైగా ఉద్యోగులకు వేతనాలు! వెరసి... ఈ ఒకటో తారీఖు లక్షల కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది.

# పేదింటికి పండగొచ్చింది

పెనుమాకలో గిరిజనుడి పూరింటికి సీఎం.. ఉబ్బితబ్బిబ్బయిన రాములు నాయక్ కుటుంబం

కుక్కిమంచంలో కూర్చుని యోగక్షేమాలు విచారించిన చంద్రబాబు

నాయక్‌కు వృద్ధాప్య పింఛను పంపిణీ.. ఆయన భార్యకు వ్యవసాయ కూలీ పెన్షన్

కుమార్తెకు వితంతు పింఛను.. స్వయంగా అందజేసిన సీఎం

ఇల్లు కూడా మంజూరు చేస్తూ అక్కడికక్కడే పత్రాలు అందజేత


ఆహా... ఒకటో తారీఖు!

- ఇంటి గడపలోకే సంక్షేమం సొమ్ము
- పెన్షన్ల చరిత్రలోనే తొలిసారి 7వేలు చేతికి...
- యజ్ఞంలా 'ఎన్టీఆర్ భరోసా' కార్యక్రమం
- ఉదయం 5.30కల్లా కదిలిన సచివాలయాల ఉద్యోగులు
- రాత్రి 8 గంటల కల్లా 94.75 శాతం మందికి..
- వలంటీర్లు లేకున్నా సాఫీగా కార్యక్రమం
- ఉద్యోగులపై జగన్‌వి అబద్ధాలని తేలిపోయిన వైనం
- పెనుమాకలో బాబు, పిఠాపురంలో పవన్ పంపిణీ
- నియోజకవర్గాల్లో మంత్రులు, నేతలు నేరుగా హాజరు



సీకే న్యూస్ హైదరాబాద్ : పింఛన్ల చరిత్రలోనే తొలిసారి ఒకేనెల రూ.ఏడువేలు చేతికి అందుకున్న ఆనందం.. ఇక అందదు అనుకున్న లబ్ధి చేతికి రావడంతో ఉద్వేగం... ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా ఇంటి గడప తొక్కి 'ఇందా సొమ్ము' అని అందిస్తుంటే పట్టలేనంత సంబరం... వెరసి రాష్ట్రమంతా పింఛన్ల పండగ మహాసంరంభంగా సాగింది. సంక్షేమపథంలో టీడీపీ కూటమి ప్రభుత్వం తొలి అడుగులోనే సూపర్ హిట్ కొట్టింది. పింఛను డబ్బులు తీసుకున్న లబ్ధిదారుల

వివరాలు 2లో..



# హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ..

## విద్యుత్తు కమిషన్‌పై వేసిన పిటిషన్ డిస్మిస్

కమిషన్ ఏర్పాటుకు హైకోర్టు సమర్థన

అప్పగించిన అంశాలు విస్తృతమైనవి..

చైర్మన్ రాజ్యాంగబద్ధ పదవిలో పనిచేశారు

తన వద్ద ఉన్న విషయాలనే వెల్లడించారు

పక్షపాతం అనడం కాదు.. నిరూపించాలి

తీర్పులో స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం

సీకే న్యూస్ హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌ను రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే పరిధి ప్రభుత్వానికి లేదని, తనకు కమిషన్ ఇచ్చిన నోటీసులు కొట్టేయాలని, కమిషన్ ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా పక్షపాతం చూపించిందంటూ కేసీఆర్ పేర్కొనడాన్ని తప్పుబట్టింది. కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. విద్యుత్తు నియంత్రణ

వివరాలు 2లో..

# ఇద్దరం కలిసి మాట్లాడుకుందాం!

విభజన అంశాలపై చర్చించుకుందాం

ఆమోదయోగ్య పరిష్కారాలు గుర్తిద్దాం

6వ తేదీన మీరున్న చోటికే వస్తా.. రేవంత్ రెడ్డికి బాబు లేఖ

తెలంగాణ ముఖ్యమంత్రి సానుకూల స్పందన

హైదరాబాద్‌లో ఇరువురు సీఎంల భేటీ



సీకే న్యూస్ హైదరాబాద్ :తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్వయంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంలో సంబంధిత అంశాలపై ముఖాముఖి చర్చించుకుందామని

వివరాలు 2లో..

# కవితక్క కూడా వస్తారు... అండగా ఉంటారు

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారన్న కేటీఆర్
- పార్టీ మారిన సంజయ్‌ని వెంటబడి మరీ ఓడిద్దామని పిలుపు
- రేవంత్ రెడ్డి మొగోడైతే పార్టీ మారిన ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని సవాల్
- రేవంత్ రెడ్డి ఆరోజు ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేశారని ఆగ్రహం
- పార్టీ ఫిరాయింపులను ప్రారంభించిందే కాంగ్రెస్ అన్న కేటీఆర్

వివరాలు 2లో..



# బాబు అనుభవంతోనే ఇది సాధ్యం!

వలంటీర్లు లేకుండానే పింఛన్ల పంపిణీ

జగన్ సర్కారులో కనివినీ ఎరుగని విధ్వంసం

'పంచాయతీ'లో తవ్వేకొద్దీ బాగోతాలు: పవన్



సీకే న్యూస్ హైదరాబాద్ :వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ జరగదని గత వైసీపీ ప్రభుత్వం దుష్ప్రచారం చేసిందని.. కానీ దానిని పటాపంచలు చేస్తూ వారు లేకుండానే పింఛన్లు పంపిణీ చేశామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సీఎం

వివరాలు 2లో..



# అనుమతుల్లేకుండా నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయం!

విచారణకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

అనుమతుల్లేకుండా బీఆర్ఎస్ కార్యాలయం!

తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోండి

మునిసిపల్ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

నిబంధనలు పరిశీలిస్తే ఎప్పుడో కూలగొట్టాల్సిందని వ్యాఖ్య

సీకే న్యూస్ హైదరాబాద్ : నల్లగొండ పట్టణ నడిబొడ్డులో రూ.100 కోట్ల విలువైన స్థలంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని అనుమతి లేకుండా నిర్మించారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.
దీనిపై మునిసిపల్ కమిషనర్ వెంటనే

వివరాలు 2లో..

# మీరు హిందువులు కాదు!

## హిందూధర్మం అహింస, నిర్భీతిని ప్రవచిస్తే..



మీరు హింస, ద్వేషం వ్యాపింపజేస్తున్నారు

అధికార పక్షానికి 24 గంటలూ అదే పని

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు

హిందూ సమాజాన్నే హింసావాదులంటారా?

రాహుల్ వ్యాఖ్యలు తీవ్రమైన విషయం: మోదీ

వివరాలు 2లో..

# లడఖ్ లో చనిపోయిన తెలుగు జవాన్ల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఇవ్వాలి

- లడఖ్ లో ఆకస్మిక వరదలతో నదిలో కొట్టుకుపోయిన యుద్ధ ట్యాంకు
- శిక్షణ పొందుతున్న ఐదుగురు జవాన్ల మరణం
- మృతుల్లో ముగ్గురు ఏపీకి చెందిన జవాన్లు

వివరాలు 2లో..



# మీరు హిందువులు కాదు!

బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్ధాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. తాము హిందువులమని చెప్పుకొంటున్న వారు నిత్యం హింస, విద్వేష వ్యాప్తికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోదీ వీరెవరూ మొత్తం హిందూ సమాజానికి ప్రతినిధులు కాదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం మధ్యాహ్నం సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదాలో తొలిసారిగా మాట్లాడారు. సందర్శకుల గ్యాలరీ నుంచి తల్లి సోనియా, సోదరి ప్రియాంక చూస్తుండగా సుదీర్ఘంగా గంటా 40 నిమిషాలపాటు ప్రసంగించారు. ఆయన మాట్లాడటానికి లేవగానే బీజేపీ సభ్యులు జైశ్రీరాం అని, విపక్ష సభ్యులు జైసంవిధాన్ అని పోటాపోటీ నినాదాలు చేశారు. ప్రసంగంలో భాగంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సభలో తీవ్ర దుమారం చెలరేగింది. మొత్తం అధికారపక్షం లేచి నిలబడింది. స్వయంగా ప్రధాని మోదీ రెండుసార్లు, మధ్యలో ఐదుగురు మంత్రులు ఒక్కోసారి రాహుల్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. అయితే, రాహుల్ ఎక్కడా తలొగ్గకుండా తన ప్రసంగ ధాటిని కొనసాగించారు. ధైర్యం గురించి అన్ని మతాలు చెప్పాయని, ఖురాన్ కూడా నిర్భీతిని ప్రబోధించిందని, దువా(ఆశీస్సుల) కోసం లేచే చేతిలో కనిపించేది అభయ ముద్రేనని రాహుల్‌గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ సభలో శివుడు, జీసస్, గురునానక్ చిత్రాలను ప్రదర్శించారు. హిందూత్వం, ఇస్లాం, సిక్కు, క్రైస్తవం, బౌద్ధ, జైన మతాలు నిర్భీతిని ప్రబోధించాయని గుర్తు చేశారు. వీళ్లందరూ భయపడొద్దు.. భయపెట్టొద్దు అని చెప్పారన్నారు. పరమ శివుడు కూడా ఎవరికీ భయపడొద్దు, ఎవర్నీ భయపెట్టొద్దని అభయ హస్తాన్ని చూపుతున్నాడని, అహింసను ప్రబోధిస్తున్నాడని దేవుడి చిత్రాన్ని చూపిస్తూ అన్నారు.

**మీరు హిందువులే కాదు..**

తమను హిందువులుగా చెప్పుకొనే వాళ్లు 24 గంటలూ విద్వేషాన్ని, హింసను, అబద్ధాలను వ్యాపింపజేయడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ సభ్యుల వైపు వేలు పెట్టి చూపిస్తూ రాహుల్ అన్నారు. బీజేపీ సభ్యులు ఆగ్రహంతో లేచి నిలబడగానే మీరు హిందువులే కాదు అని మరింత గట్టిగా చెప్పారు. సత్యానికి కట్టుబడి ఉండాలని, వెనక్కి తగ్గొద్దని, సత్యం మాట్లాడటానికి భయపడొద్దని హిందూమతంలో రాసి ఉందన్నారు. ఈ సందర్భంగానే ప్రధాని మోదీ జోక్యం చేసుకున్నారు. "ఇది చాలా తీవ్రమైన విషయం. మొత్తం హిందువులను హింసావాదులనడం తీవ్రమైన విషయం" అన్నారు. దానికి రాహుల్ బదులిస్తూ, "బీజేపీ, మోదీయే మొత్తం హిందూ సమాజం కాదు. ఆరెస్సెస్ మొత్తం హిందూ సమాజం కాదు. హిందూత్వాన్ని బీజేపీకి కాంట్రాక్టు రాసివ్వలేదు" అన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా దేవుళ్ల పటాలను సభలో చూపించడం మీద అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడానికి అనుమతి లేదని చెప్పారు. బీజేపీ మైనారిటీలను బెదిరిస్తోందని, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని, హింసను ప్రేరేపిస్తోందని రాహుల్ ఆరోపించారు. సభలో తాను మాట్లాడేటప్పుడు మోదీ ఎందుకు సీరియస్‌గా ఉంటారని రాహుల్‌గాంధీ ప్రశ్నించగా, విపక్ష నేతను సీరియస్‌గా తీసుకుంటామని, ఆ పదవిని గౌరవించడం రాజ్యాంగం తనకు నేర్పిందని మోదీ అన్నారు. కాగా, మణిపూర్‌ను అంతర్యుద్ధం స్థాయికి తీసుకెళ్లిన మోదీ ఇంతవరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని రాహుల్ అన్నారు. అగ్నివీర్ పథకంతో సైనికులను వాడుకొని వదిలేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. భారత్ అనే భావన మీద, రాజ్యాంగం మీద బీజేపీ పూర్తి స్థాయిలో ఒక పద్ధతి ప్రకారం దాడి చేస్తోందని రాహల్‌గాంధీ ఆరోపించారు. చాలామంది విపక్ష నేతల మీద వ్యక్తిగత దాడికి పాల్పడ్డారని, కొందరు ఇప్పటికీ జైళ్లలో ఉన్నారని పరోక్షంగా కేజ్రీవాల్ అరెస్టును ప్రస్తావిస్తూ చెప్పారు.

# పేదింటికి పండగొచ్చింది

- మొదటి పేజీ తరువాయి

మోముల్లో ఇంద్రధనస్సులోని సప్తవర్ణాలూ కళగట్టాయి. మరోవైపు పెన్షన్ల పంపిణీ అనేది సచివాలయ ఉద్యోగులతో వీలు కాదు.. వలంటీర్లతోనే అది సాధ్యమవుతుందంటూ ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం చేసిన వాదనలను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పటాపంచలు చేశారు. 'బ్యాంకులకు వెళ్లి పింఛను డబ్బులు డ్రా చేసుకుని వచ్చేది మేం.. మాకు వాటిని పంపిణీ చేయడం చేతకాదా' అని అప్పట్లో తేల్చిచెప్పిన ఈ ఉద్యోగులు, అన్నట్టుగానే ఒక్కరోజులోనే పింఛన్ల పంపిణీని దాదాపు పూర్తి చేశారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం ఉదయం 5.30 గంటలనుంచే ప్రారంభమైంది. రాత్రి 8 గంటల సమయానికి 94.75 శాతం పంపిణీ పూర్తి అయింది. ఇందులో అత్యధికంగా విజయనగరం జిల్లాలో 96.93 శాతంమందికి, అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 91.27 శాతం మందికి పింఛన్ సొమ్ములు అందాయి. రాష్ట్రంలో పింఛన్లు అందుకుంటున్న వారు 64 లక్షలమంది ఉండగా, వారిలో 61 లక్షలమంది చేతికి సొమ్ము చేరిపోయింది. రాజధానిలోని పెనుమాకలో జరిగిన పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పాల్గొంటే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పింఛను సొమ్ము పేదల చేతికి అందించారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు తమ నియోజకవర్గాల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

**పరుగు వేగంతో పూర్తి...**

రాష్ట్రంలో 1.2 లక్షలమంది సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు. ఉన్నత విద్యావంతులు కావడం, సాంకేతిక నైపుణ్యం తెలిసినవారు కావడంతో వీరు పెన్షన్ల పంపిణీలో తమకిచ్చిన టార్గెట్‌ను అందుకోగలిగారు. బయోమెట్రిక్ మెషిన్ల ద్వారా వేగంగా ప్రక్రియను ముగించారు. నిజానికి, గతంలో కూడా వలంటీర్లు....సచివాలయ ఉద్యోగుల సహకారం లేకుండా పెన్షన్లు పంపిణీ చేయలేదు. డబ్బులు బ్యాంకుల నుంచి డ్రా చేసి వలంటీర్లకు అందించడంతోపాటు సాంకేతిక సహకారం అందించేవారు. ఇప్పుడు వారే రంగంలోకి దిగడంతో పంపిణీ తేలికైంది. విధి నిర్వహణలో వీరి పట్టుదలను ముఖ్యమంత్రి అభినందించారు.

# ఇద్దరం కలిసి మాట్లాడుకుందాం!

- మొదటి పేజీ తరువాయి

ప్రతిపాదించారు. ఇందుకు రేవంత్ కూడా అంగీకరించారు. దీనిపై మంగళవారం లిఖితపూర్వకంగా తన స్పందన తెలియచేయనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికారికంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రులతోపాటు రెండు రాష్ట్రాల నుంచి ఇద్దరు చొప్పున సీనియర్ మంత్రులు, సంబంధిత అంశాలకు సంబంధించిన సీనియర్ అధికారులు కూడా హాజరవుతారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని అంశాలు రెండు రాష్ట్రాల మధ్య ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయాయి. ఉమ్మడి సంస్థల మధ్య ఆస్తుల విభజన కూడా పూర్తికాలేదు. ఈ నేప?థ్యంలోనే రేవంత్‌తో భేటీకి చంద్రబాబు సిద్ధమయ్యారు. 'నేనే మీ వద్దకు వస్తాను' అంటూ భేషజాలను పక్కన పెట్టి మరీ లేఖ రాశారు. ఈ భేటీకి ముందు చంద్రబాబు రెండు రోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఆ సమయంలో ఈ అపరిష్కృత సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకురానున్నారు. దాని కొనసాగింపుగా రేవంత్‌తో ఆయా అంశాలపై చర్చిస్తారు. జగన్, కేసీఆర్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఒకసారి సమావేశమైనా... అది వారిద్దరి వ్యక్తిగత భేటీగానే జరిగింది. ఏ అంశమూ పరిష్కారం కాలేదు. ఈసారి ఇటు చంద్రబాబు, అటు రేవంత్ ఇద్దరూ సానుకూల దృక్పథంతో ఉండటంతో... విభజన అంశాల పరిష్కారంలో ముందడుగు పడే అవకాశముందని అంటున్నారు.

**ఇదే తొలిసారి...**

చంద్రబాబు, రేవంత్ ముఖ్యమంత్రుల హోదాలో సమావేశం కావడం ఇదే మొదటిసారి. రేవంత్ గతంలో చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలో పనిచేశారు. ఆ తర్వాత ఆ పార్టీని వీడి కాంగ్రెసలో చేరారు. ఆ పార్టీ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు రాజకీయ శిబిరాల్లో ఉండటంతో వీరిద్దరూ కలుసుకోవడం ఇటీవలి కాలంలో సాధ్యపడలేదు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రేవంత్‌కు ఆహ్వానం అందినా... ఆ కార్యక్రమాన్ని ఎన్డీయే కూటమి కార్యక్రమంగా నిర్వహించడంతో ఆయన రాలేదు. అధికారికంగా రెండు రాష్ట్రాల మధ్య ఒక సమావేశాన్ని నిర్వహించాలన్న ఆలోచన ఇటీవల ఇరువైపులా వచ్చింది. దాని ఫలితమే ఈ సమావేశమని చెబుతున్నారు. దీనికి ప్రాతిపదికగా చంద్ర బాబు అధికారికంగా తెలంగాణ ముఖ్యమంత్రికి ఒక లేఖ రాసి దానిని సోమవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

# హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ..

- మొదటి పేజీ తరువాయి

కమిషన్ (ఈఆర్సీ) ఇప్పటికే విచారించినప్పటికీ.. విద్యుత్తు కమిషన్‌కు ప్రభుత్వం అప్పగించిన అంశాలు (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్) చాలా విస్తృతమైనవని పేర్కొంది. అందుకే ఆ అంశాలపై విచారణ చేపట్టే అధికారం కమిషన్‌కు ఉందని స్పష్టం చేసింది. కమిషన్ చైర్మన్.. చీఫ్ జస్టిస‌గా ఒక ఉన్నతమైన రాజ్యాంగబద్ధ పదవిని నిర్వహించారనే విషయాన్ని మరువరాదని హితవు పలికింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తన ఎదుట విచారణలో ఉన్న అంశాలను మాత్రమే మీడియా సమావేశంలో వెల్లడించారని, అందులో పక్షపాతం ఏమీ లేదని పేర్కొంది. పక్షపాతం అంటే కేవలం ఆరోపణ లేదా ఊహించుకోవడం కాదని, దానిని నిరూపించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కీలక అంశాలను స్పృశిస్తూ తీర్పు వెలువరించడానికి వీలుగా ధర్మాసనం పలు ప్రశ్నలను రూపొందించి.. వాటికి సమాధానాలిచ్చింది.

ఛత్తీసగఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేయాలన్న అప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై తీసుకున్న నిర్ణయాలను ఇప్పటికే ఈఆర్సీ విచారించింది కదా? మళ్లీ దానిపై విచారణ చేపట్టే పరిధి కమిషన్ ఉందా? అనే ప్రశ్నకు ధర్మాసనం బదులిస్తూ, '2015లో తెలంగాణ, ఛత్తీసగఢ్ రాష్ట్రాల విద్యుత్తు సంస్థల మధ్య పీపీఏలు జరిగాయి. ఈ ఒప్పందాలను, టారిఫలను వ్యతిరేకిస్తూ పలువురు ఈఆర్సీని ఆశ్రయించారు. ఈఆర్సీ బహిరంగ విచారణ చేపట్టి 2017లో తీర్పు వెల్లడించింది. అలాగే ఛత్తీసగఢ్ ఈఆర్సీ సైతం 2018లో టారిఫలను నిర్ధారించింది. ఈ తీర్పులపై అప్పీళ్లు దాఖలు కాగా.. అవి అప్పీలేట్ ట్రైబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ, ఛత్తీసగఢ్ ఈఆర్సీలు ఇచ్చిన తీర్పు కాపీలను పిటిషనర్ సమర్పించకపోయినా.. అఫిడవిట్ ద్వారా ఈ వ్యవహారంపై రెండు రాష్ట్రాల ఈఆర్సీలు విచారణ చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

పభుత్వం విద్యుత్తు కమిషన్‌కు అప్పగించిన అంశాల్లో ఈఆర్సీ విచారించిన అంశాల కంటే విస్తృతమైన అంశాలున్నాయి. కమిషన్ గుర్తించిన లోపాలకు, ఆర్థికపరమైన నష్టాలకు బాధ్యులు ఎవరో గుర్తించే బాధ్యతను సైతం కమిషన్‌కు అప్పగించారు. మరోవైపు ఈఆర్సీ ఇప్పటికే విచారించిన అంశాలపై టారిఫ్ నిర్ధారణ వంటి విషయాలు ప్రస్తుత విద్యుత్తు కమిషన్‌కు అప్పగించిన బాధ్యతల్లో లేవు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈఆర్సీ విచారించిన అంశాలపై విచారించే అధికార పరిధి ఎంక్వైరీ కమిషన్‌కు లేదనే వాదన ఆమోదయోగ్యం కాదు. ఈఆర్సీ విచారించినవి, కమిషన్‌కు అప్పగించిన అంశాలు వేర్వేరు అయినందున కమిషన్‌కు పరిధి ఉంటుంది" అని ధర్మాసనం వివరించింది.కమిషన్ పక్షపాత, వివక్షాపూరిత ధోరణితో వ్యవహరిస్తోందా? ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా తన ఎదుట ఉన్న వ్యవహారాలపై ముందే ఓ నిర్ణయం ప్రకటించిందా? అనే ప్రశ్నకు ధర్మాసనం సమాధానం ఇస్తూ, 'పిటిషనర్ (కేసీఆర్) ప్రతివాదిగా చేర్చిన మూడో ప్రతివాది కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డికి నోటీసులు జారీ చేయాలంటే పక్షపాతం అనే అంశంపై ముందుగా ఈ కోర్టు సంతృప్తి చెందాల్సి ఉంటుంది. కమిషన్ చైర్మన్ ఏప్రిల్ 14న పిటిషనర్‌కు నోటీసులు జారీచేశారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున రాలేనని, సమయం పొడిగించాలని మే 1న పిటిషనర్ సమాధానం ఇచ్చారు. మళ్లీ కమిషన్ పిటిషనర్‌కు లేఖ రాస్తూ మూడు నెలల్లో రిపోర్ట్ ఇవ్వాల్సి ఉందని.. మే 13న ఎన్నికలు ముగుస్తున్నందున మే 31 లేదా జూన్ 15 లోపు మీకు తగిన సమయాన్ని వెల్లడించండని కోరింది.

# బాబు అనుభవంతోనే ఇది సాధ్యం!

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు అపార అనుభవం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వ అరాచకాలను సరిదిద్ది రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లగలిగేది ఆయనేనని తేల్చిచెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని మండిపడ్డారు. అధికార వ్యవస్థ మొత్తాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి వ్యవస్థలను బాగుచేసే పనిలో ఉన్నామని, తమది కరెక్షన్ ప్రభుత్వమని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత, డిప్యూటీ సీఎం హోదాలో ఆయన తొలిసారి సోమవారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ సభలో ప్రసంగించారు. తెలిపారు. పిఠాపురంలో స్థలం కోసం చూస్తున్నానని, ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

**ఒక్కొక్కరి నుంచి రూ.300 లంచం!**

చంద్రబాబు అపార అనుభవంరాష్ట్రానికి చాలా అవసరం. ఆయన అనుభవం వల్లే ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వగలుగుతున్నాం. గత ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ ద్వారా పంపిణీ చేసింది. వీరేమో ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.300 వరకు లంచంగా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే పెన్షన్లు రద్దు చేస్తారని వైసీపీ ప్రచారం చేసింది. కానీ ఏమైంది..? ప్రతి ఒక్కరికీ రెట్టింపు డబ్బులు వచ్చాయి. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగికి బాధ్యత ఉంటుంది. కానీ ప్రైవేటు ఉద్యోగికి బాధ్యత ఉండదు. వలంటీర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి ఎలాగా అని ఆలోచిస్తున్నాం.

**ఎన్ని తిట్టినా పట్టించుకోం..**

పౌరసరఫరాల శాఖలో ఎంత అవినీతి జరిగిందో చూడండి. ప్రజల బియ్యాన్ని గోడౌన్‌లో ఎలా దాచారో అంతా చూడాలి. ఇది పేదల డబ్బు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలను చంపేసి వ్యక్తులు పెరిగిపోయారు. అడ్డగోలుగా అవినీతి జరిగింది. కడపలో బెరైటీస్ గనులను ఖాళీ చేసేశారు. ఇసుకతోపాటు అనేక వాటిలో గత ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మాది కరెక్షన్ ప్రభుత్వం. మేం ఎవరిపైనా కక్ష సాధించడానికి లేం. వైసీపీ వాళ్లు ఎన్ని తిట్టినా పట్టించుకోం. కాకపోతే వారి తప్పులను బయటకు తీస్తాం. నా జీవితంలో వందల కోట్లు సంపాదించాను. ఆడిటర్ లెక్కలు చూపిస్తే తలనొప్పి వచ్చేది. పన్ను ఎంత కట్టాలని మాత్రమే అడిగేవాడిని. గంట లేదా రెండు గంటలు మాత్రమే నా లెక్కలు చూసేవాడిని. కానీ ప్రజల డబ్బుకు వచ్చేసరికి.. పంచాయతీరాజ్‌శాఖలో లెక్కలు చూస్తూ జనం కోసం ఆడిటర్‌గా మారాను. ఈ శాఖ మంత్రిగా అవగాహన చేసుకోవడానికి చాలా సమయం పడుతోంది. ఎక్కువ మాటలు చెప్పి తక్కువ పని చేయదలచుకోలేదు. పంచాయతీరాజ్‌శాఖలో తవ్వేకొద్దీ గత ప్రభుత్వ బాగోతాలు చాలా బయట పడుతున్నాయి. అడ్డగోలుగా నిధులు దారిమళ్లించేశారు. అసలు ఎటు వెళ్లాయో తెలియదు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

- మొదటి పేజీ తరువాయి

సన్నిధిలో ప్రారంభించామని చెప్పారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని ఇందుకు అనుగుణంగా వచ్చే బడ్జెట్లో నిధుల కేటాయింపులు కూడా జరుపుతున్నామని వెల్లడించారు. సచివాలయంలో హౌసింగ్ పై ఆయనసమీక్ష నిర్వహించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు మంత్రి పొంగులేటి, మొదటి దశలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3 వేల500 ఇండ్ల చొప్పున 4 లక్షల16 వేల 500 ఇండ్లు, రిజర్వ్ కోట కింద 33 వేల 500 ఇండ్లు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు అవసరమైన 22 వేల 500 కోట్ల రూపాయలను బడ్జెట్లో కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రికి వెల్లడించామన్నారు. గడచిన పది సంవత్సరాలలో సొంత ఇంటి సాకారం అనేది పేదవారికి అందని ద్రాక్షలా మారిందని మంత్రి పొంగులేటి ఆవేదం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికి కనిపిస్తున్నాయని అన్నారు. పేదలు ఆత్మగౌరంతో బతకాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

## లడఖ్ లో చనిపోయిన తెలుగు జవాన్ల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఇవ్వాలి

లడఖ్ లో శిక్షణలో భాగంగా ఓ యుద్ధ ట్యాంకుతో నదిని దాటే విన్యాసాలు చేపడుతున్న భారత జవాన్లు ఆకస్మిక వరద కారణంగా మృత్యువాత పడడం తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు మరణించారు. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన జవాన్లు ఉన్నారు. దీనిపై ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. లడఖ్ లో యుద్ధ ట్యాంకు నదిలో కొట్టుకుపోయిన ప్రమాదంలో జవాన్లు మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం జవాన్ల త్యాగాలు మరువలేనివని తెలిపారు. మరణించిన జవాన్లలో కృష్ణా జిల్లాకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లాకు చెందిన ముత్తుమల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లాకు చెందిన సుభాన్ ఖాన్ ఉండడం బాధాకరమని జగన్ వెల్లడించారు.

"మృతి చెందిన జవాన్లకు నివాళులు అర్పిస్తున్నాను. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ప్రమాదంలో అసువులు బాసిన తెలుగు జవాన్ల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ జగన్ ట్వీట్ చేశారు.

## అనుమతుల్లేకుండా నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయం!

- మొదటి పేజీ తరువాయి

నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆ స్థలాన్ని కాపాడేందుకు తాను కృషి చేస్తానన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న 33 కేవీ సబ్‌స్టేషన్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎవరూ అడగకపోతే నడిరోడ్డు మీద ఇల్లు కట్టుకున్నా మునిసిపల్ అధికారులు ఏమీ అనేలా లేరని, ఇదేనా మీ వ్యవహారం అంటూ నిలదీశారు. సామాన్యులకు ఎలాంటి నిబంధనలు వర్తింపజేస్తారో... రాజకీయ పార్టీలకైనా, పెద్దవాళ్లకైనా అలాంటి నిబంధనలే అమలు చేయాలని అన్నారు.

నిబంధనలు పరిశీలిస్తే బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఎప్పుడో కూలగొట్టి ఉండాల్సిందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం అందరి కర్తవ్యమని, బీఆర్ఎస్ కార్యాలయం నిర్మించిన విలువైన స్థలంపై జిల్లా కలెక్టర్ విచారణ జరపాలని కోరారు. ప్రతిదానికీ బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని, కానీ తాము ప్రజాప్రయోజనాల అంశంలో ఎన్నడూ రాజకీయాలు చేయలేదని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ సమయంలో వందలాది మందికి సంబంధించి, కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కూలగొట్టినా, పరిహారం ఇవ్వకపోయినా తాము ఎవరినీ బదనాం చేయలేదన్నారు.

## కవితక్క కూడా వస్తారు... అండగా ఉంటారు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నార ని... కానీ ఇక్కడి కార్యకర్తలకు తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జగి త్యాల లో తాను గల్లీ గల్లీ తిరుగుతా నని హామీ ఇచ్చారు. కవితక్క కూడా వస్తారని అండగా

ఉంటారన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలే ఉంటాయన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్‌ని వెంటబడి మరీ ఓడిద్దామని పిలుపునిచ్చారు. ఆయన బండ కట్టుకొని బావిలో దూకాడని... కానీ మనం ధైర్యంగా ముందుకు సాగుదామని కార్యకర్తలకు సూచించారు. నీవు మొగోడివి అయితే.. ఆ ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రా ఓట్లతో కొట్టి ఆ ఆరుగురిని శాశ్వతంగా రాజకీయ సమాధి చేసే బాధ్యత తెలంగాణ సమాజం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు. రోషం, దమ్ముంటే పదవికి రాజీనామా చేసి ప్రజల్లోకి రావాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నాం కదా అని కొందరు అంటున్నారని... మనకు, వాళ్లకు తేడా ఏమిటో తెలియాలన్నారు. పార్టీ ఫిరాయింపులకు తొలుత పాల్పడింది కాంగ్రెస్సే అన్నారు. ఆయారాం.. గయారాం.. విషబీజానికి మొగ్గ తొడిగింది ఇందిరాగాంధీ హయాంలోనే అని విమర్శించారు. నాడు హర్యానాలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను లాక్కొని... పార్టీ ఫిరాయింపుల సంస్కృతి తీసుకువచ్చారని ఆరోపించారు.

**రేవంత్ రెడ్డి ఆరోజు ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేశారు**

2004లో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకొని గెలిచిందని, తమ పార్టీ నుంచి 26 మంది గెలిస్తే నాటి వైఎస్ ప్రభుత్వం 10 మందిని తమలో కలుపుకునే ప్రయత్నం చేసిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి 2014లో కేసీఆర్ తెలంగాణ సాధించారని... అయితే నాడు రేవంత్ రెడ్డి రూ.50 లక్షలతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తూ అడ్డంగా దొరికిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేయడంతో... ఆ తర్వాత టీడీపీ, బీఎస్పీ నుంచి మూడింట రెండొంతుల ఎమ్మెల్యేలు వచ్చి బీఆర్ఎస్‌లో విలీనమయ్యారని తెలిపారు. అప్పుడు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కలేదన్నారు.

**ఇప్పుడు ఆ పిచ్చి కుక్క ఎవరు?**

పార్టీ ఫిరాయింపులకు పాల్పడే ఎమ్మెల్యేలను కుక్కల మాదిరి రాళ్లతో కొట్టి చంపాలని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని... ఇప్పుడు ఆ పిచ్చికుక్క ఎవరు? అని ప్రశ్నించారు. అలాంటి వారిని రాళ్లతో కొట్టి చంపాలన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే తీసుకున్న ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. ఓట్లతో కొట్టి ఆ ఆరుగురిని రాజకీయంగా శ్వాశతంగా సమాధి చేసే బాధ్యత తెలంగాణ సమాజం తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారితే ఆటోమేటిక్‌గా డిస్క్వాలిఫై చేస్తామని రాహుల్ గాంధీ అన్నారని... కానీ ఆ మాటను విస్మరించారన్నారు.

# ఉపాధి కూలీలకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలి

● ఆర్డీఓ కు వినతిపత్రం సమర్పించిన వ్యవసాయ కార్మిక సంఘం



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి (రామయ్య) జూలై 01:** ఉపాధి కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సోమవారం నాడు హుజూర్నగర్ లో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ

పనిచేస్తున్న ప్రదేశంలో ఉపాధి కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే 25 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, అంగవైకల్యం ఏర్పడితే 10 లక్షలుఎక్స్గ్రేషన్ చెల్లించాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నవిషయం బహిర్గతమైందని, రోజుకు రెండుసార్లు ఫోటో అప్లోడ్ చేసే విధానం వల్ల ఉపాధి కూలీలు అనేక అవస్థలు పడుతున్నారని పనిచేసే చోట కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కల్పించకపోవడం కూడా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే భాగంలో కుట్ర అని, పెరుగుతున్న నిత్య అవసర వస్తువుల ధరలను గమనంలో ఉంచుకొని రోజుకు 600 రూపాయల కూలీలతో పాటు సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని, గ్రామం నుంచి పని చేసే ప్రదేశానికి కూలీలకు ఆటో సౌకర్యం కల్పించాలని, వికలాంగులకు వారు చేయగలిగే పని మాత్రమే చూపించాలని ఆయన వినతిపత్రంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్

హుజూర్ నగర్ పట్టణ సిపిఐ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సహాయ కార్యదర్శి జడ వెంకన్న, మఠంపల్లి మండల సిపిఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య, మేళ్లచెరువు మండల సిపిఐ కార్యదర్శి సారెడ్డి పాపిరెడ్డి, ప్రజారాజ్యబండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ రైతు సంఘం నాయకులు జక్కుల రమేష్ ప్రజా కళాకారుడు కొట్టు బాబు జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**భద్రాచలంలో ఐ ఎం ఎ అధ్వర్యంలో డాక్టర్స్ అందరూ మార్నింగ్ వాక్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గోన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీలో ఎంతో మంది ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ, ప్రజల ఆరోగ్య రక్షణకు, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న డాక్టర్స్ అందరికీ జాతీయ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసారు...ఈ కార్యక్రమంలో ఐ ఎం ఎ అధ్యక్షులు డాక్టర్ ఆది. మోహన్ రావు, పెన్నింటి రాజశేఖర్, ప్రభుత్వ హాస్పిటల్ సూపర్నెంట్ ముదిగొండ రామకృష్ణ, మరియు స్థానిక డాక్టర్స్ అందరు పాల్గొన్నారు......

# సామాజిక పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్న గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి.



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలో సామాజిక పెన్షన్ 7000 రూపాయలను గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి చేతుల మీదగా పురుషోత్తపట్నం పెన్షన్ దారులకు అందజేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఏప్రిల్ మే జూన్ 3 నెలల బకాయిల తో పాటు జులై నెల 4 వేల రూపాయల పెన్షన్ కలిపి మొత్తం 7000 రూపాయలను పెన్షన్ దారులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ, నాగేశ్వరరావు, మరియు పెన్షన్ దారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభను ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**భూమి సమస్యను తన ఆజెండా పైకి తెచ్చిన కామ్రేడ్ దొడ్డు కొమరయ్య 78వ వర్ధంతి ప్రదర్శన సదస్సు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జూలై 4న జరగనున్నదని దీనికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ పాల్వంచలోని నటరాజ్ సెంటర్లో పోస్టర్ ఆవిష్కరించారు.

అనంతరం లి%శ్రీ%సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ నిజం రాచరిక భూస్వామ్య వ్యవస్థ పునాదివినగా ఉన్న ఆ రోజుల్లోనే తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి భూముల ను భూస్వాముల చేతుల్లోంచి ప్రజలకు పంచి పెట్టడంలో ప్రధాన పాత్ర పోషించి తెలంగాణ సాయుధ పోరాటం తొలి అమరవీరుడిగా కామ్రేడ్ దొడ్డి కొమరయ్య చరిత్రలో నిలిచిపోయారని ఆయన అన్నారు. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా భూమి సమస్య అలానే ఉందని భూమి సమస్యను పరిష్కరించిన దశలో ఏ ప్రభుత్వాలు లేవని ఆయన అన్నారు. ఇంకా భూమి భుక్తి విముక్తి కోసం పోరాటాలు సాగుతూనే ఉన్నాయని వారన్నారు. 1946 నుండి



52 వరకు సాయుధ పోరాటంలో 4,000 మంది ప్రాణాలు కోల్పోయారని 2000 గ్రామాలు ప్రజా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయని 10 లక్షల ఎకరాల భూములను ప్రజలు స్వాధీన పరుచుకున్నారని కుల మతాల కచ్చితంగా ప్రజలు ఐక్యమై ఈ పోరాటం కొనసాగించారని వారు అన్నారు దొడ్డి కొమరయ్య వారసత్వంతో అనేకమంది గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల రూపంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం రామ నరసయ్య కట్ట నరసింహారెడ్డి విక్రమ్ అన్న లింగన్న కోటన్న బాటనలు కాచినపల్లి ఎన్కౌంటర్లు ఇలా ఎంతోమంది తమ అమూల్యమైన ప్రాణాలను ఈ విప్లవద్యమంలో అర్పించారని వారన్నారు. వారి ఆశయ సాధనలో నేడు మలిదశ పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ కార్యక్రమం లో భాగంగానే ఈ దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ ఖమ్మం లో నిర్వహిస్తున్నారని దీనికి ప్రజలు ప్రజా స్వామ్యవాదులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఏర్పం శ్రీనివాస్,ఆర్యంపుల రాజేష్, మల్లేష్, వెంకన్న,భాస్కర్,కాసిం,గోపి, భూషణం, నరసింహ, నాగరాజు, వెంకటేశ్వర్లు, మల్లయ్య, ఈశ్వరు, రాంబాబులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లించాలి.



● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేర్పుల మల్లికార్జున్ డిమాండ్ చేశారు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),జూలై 01,**అశ్వాపురంలో గత 7 నెలలు గా పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేర్పుల మల్లికార్జున్, డిమాండ్ చేశారు సోమవారం పలు సమస్య లతో కూడిన వినతిత్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరప్రసాద్ మండల పంచాయితీ అధికారికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ %అ% వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు యేదాల్లి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దరావత్ రాంబాబు, నాయకులు రవి దొడ్డ వెంకటేశ్వర్లు సున్నం శ్రీనివాస్ తేజవత్ వెంకటేష్ సున్నం శ్రీను వెంకటరమణ పద్మ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం.

● బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలే చంద్రశేఖర్‌లి




**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 1.**వలిగొండ మండల కేంద్రంలోని శివాజీ యువజన సంఘం సభ్యులు,బీజేపీ కార్యకర్త జోర్క వెంకటేశం గత కొంతకాలంగా అనారోగ్యపాలై ఒక కాలు తీసివేయడం జరిగింది ఇట్టి విషయం తెలుసుకున్న బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలే చంద్రశేఖర్ గారు వారిని పరామర్శించి వారికి 10,000/- పది వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బోల్ల సుదర్శన్ ,బిజెపి జిల్లా నాయకులు దంతూరి సత్తయ్య , బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్ రాచకొండ కృష్ణ , బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చు శ్రీనివాస్ , బిజెపి మండల ఉపాధ్యక్షులు దోగుపర్తి సంతోష్ , దయ్యాల వెంకటేష్, కార్యదర్శి మందుల నాగరాజు, బీజేవైఎం భువనగిరి అసెంబ్లీ కోకన్వీనర్ బుంగమట్ల మహేష్.బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు రేగూరి అమరేందర్, మైసోల్ల మచ్చ గిరి ,బీజేవైఎం మండలాధ్యక్షులు రంజిత్ రెడ్డి కీర్తి వెంకటేశం. మాటూరి శివకుమార్ . బర్ల మల్లేష్. గుండా సందీప్ కుమార్, రేగు శ్రీధర్ , ఆవనగంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రొద్దుటూరు లింగరాజు పల్లి గ్రామాల మధ్య బిటి రోడ్డు వేయాలి..

● సిపిఎం పోరుబాటలో డిమాండ్...

**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 1.**ప్రొద్దుటూరు లింగరాజు పల్లి గ్రామాల మధ్యన ప్రజలకు రైతాంగానికి ఇబ్బందులకు గురి చేస్తున్న మట్టి రోడ్డును వెంటనే బీటి రోడ్డుగా మార్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 1 నుండి 30వ తేదీ వరకు చేపట్టిన పల్లె పల్లెకు సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా పొద్దుటూరు గ్రామంలో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు గ్రామంలోని రైతాంగం తమ పొలాల వద్దకు వెళ్లే పొద్దుటూరు-లింగరాజు పల్లి గ్రామాల మధ్యన 3 కిలోమీటర్ల మేర ఉన్న మట్టి రోడ్డు గుంతల మాయమై తీవ్రంగా ఇబ్బందులు గురిచేస్తుందన్నారు నిత్యం ఈ రోడ్డువెంట వందలాది మంది ప్రజలు,రైతులు ప్రయాణం చేస్తుంటారని వెంటనే మట్టిరోడును బీటీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ప్రొద్దుటూరు నుండి వర్కట్ పెళ్లికి వెళ్లే మూసి వంతెనపై గల తాత్కాలిక బ్రిడ్జిపై నూతన బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రొద్దుటూరు నుండి వర్కట్ పల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు

గ్రామంలో అనేకమంది పేదలకు నేటికీ రేషన్ కార్డులు లేవని గత పది సంవత్సరాలుగా ప్రభుత్వం రేషన్ కార్డులు




ఇవ్వక పోవడంతో తమ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే పరిస్థితి లేదని వెంటనే రేషన్ కార్డులు లేని కుటుంబాల అందరికీ నూతన రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ప్రొద్దుటూరు నుండి భీమ లింగం వరకు భీమ లింగం కాల్వ కట్టపై గల మట్టి రోడ్డు అధ్వానంగా మారిందని పొద్దుటూరు నుండి భీమలింగం వరకు రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కోరారు ప్రొద్దుటూరు గ్రామంలో గల ఏనె గుట్టను ప్రభుత్వం తొలగించి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఈర్లపల్లి ముత్యాలు,మండల కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ ఏలే కృష్ణ, సిపిఎం శాఖ కార్యదర్శి పలుసం లింగం, సిపిఎం శాఖ సహాయ కార్యదర్శి పెద్ద బోయిన నరసింహ, నాయకులు గడ్డం సుదర్శన్,బత్తుల పురుషోత్తం,నర్సింహ,ముత్యాలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# బి ఎన్ ఎస్, బి ఎన్ ఎస్ ఎస్, బి ఎస్ ఏ చట్టాలను రద్దు చేయాలి.

భద్రాచలం బార్ అసోసియేషన్ ఆద్వర్యం లో నిరసన కార్యక్రమం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,** జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ భద్రాచలం లో కోర్టు ముందు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టేకి చైతన్య పాల్గొని ప్రజల పౌర హక్కుల ను కాలరాసే చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకు రావటం చాలా అన్యాయ మని ధ్వజ మెత్తారు. రాజ్యాంగ హక్కులను మరియు స్ఫూర్తి కి విరుద్ధం గా యునయ్ అని వాటిని వెంటనే రద్దు చైయాలి అని బార్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు

ఈ మూడు చట్టాలు పై పార్లమెంట్ లో చర్చించి పురసమీక్ష చైయాలి అని ప్రజల స్వచ్ఛ ను కాపాడాలి అని డిమాండ్ చేశారు . ఏ ఐ ఎల్ యు, ఐ ఎ ఎల్, బి ఆర్ ఎస్, కాంగ్రెస్, లీగల్ సెల్ నాయకులు. న్యాయ వాదులు ఎంవి ప్రసాద్ రావు, విద్యా సాగర్ ,దాగం ఆదినారాయణ, రేపూరి జయరాజు, పడి సిరి శ్రీనివాస్, కొండ పల్లి మహేశ్వర్ రావు, పేరాల నాగరాజు, బండారు రమేష్, బండారు అరుణ్ చందు, పేరాల వెంకటేశ్వర్లు, ఉప్పు గౌతమ్,తాత లలిత, విద్యదరి, రమ,అవులూరి సత్యనారాయణ, సదనపల్లి సతీష్, భాస్కర్, కాపుల ప్రకాష్, మల్లేష్ , బి వి కార్తీక్ ,శివ క్రిష్ణ,తదితర న్యాయ వాదులు పాల్గొన్నారు

# బండారు చంద్రరావు (బి.సి.ఆర్) ట్రస్ట్ సేవలు అమోఘం.

● భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 1.** బండారు చందర్రావు బీసీ ఆర్ ట్రస్టు సేవలు అమోఘమని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బండారు చందర్రావు (బీ.సీ.ఆర్) ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా భద్రాచలం పట్టణంలోని డాక్టర్స్ ను అభినందిస్తూ సన్మానించటం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కరోనా సమయంలో కరోనా ఐసోలేషన్ కేంద్రం నిర్వహించి అనేకమంది కరోనా పేషెంట్స్ కు అమూల్యమైన సేవలు బీసీ ఆర్ ట్రస్ట్ ద్వారా అందించారని కొనియాడారు. కరోనాతో చనిపోయిన వారి భౌతిక కాయాలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారని, గోదావరి వరద అలా సమయంలో వరద బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టారని ట్రస్టును అభినందించారు. డాక్టర్స్ సేవలను గుర్తించి ఈ రకంగా తమకు సన్మానం చేయటం తమ ఎంతో సంతోషపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి బీసీఆర్ ట్రస్టు కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షత వహించారు. ట్రస్టు సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్లు చేసిన సేవలకు సన్మానం కాదని అభినందనల కార్యక్రమం అని అన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని అందుకు ప్రజల సహకారం తోడ్పాటు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ఏ మోహనరావు, కార్యదర్శి ముదిగొండ రామకృష్ణ, డాక్టర్ పి రాజశేఖర్, డాక్టర్ జి వి వి సుదర్శన్ రావు, డాక్టర్ జి పుల్లయ్య, డాక్టర్ విజయ రావు, డాక్టర్ ఆర్ నారాయణ, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ కొడాలి లోకేష్, డాక్టర్ పవన్ రెడ్డి, డాక్టర్ ఎం సత్యం, డాక్టర్ జయ భారతి, డాక్టర్ శ్రీ క్రాంతి, డాక్టర్ నీలిమ, డాక్టర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. వీరందరినీ ట్రస్టు తరపున సన్మానించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణ ప్రచురించిన డాక్టర్స్ డే స్పెషల్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గడ్డం స్వామి, యన్ లీలావతి, వై వి రామారావు, పి సంతోష్, డి సీతాలక్ష్మి, బి బి జి తిలక్, ఎన్ వి ఎస్ నారాయణ, కే రమేష్ కే శ్రీనివాసరావు ఎస్ భూపేందర్, జీ రామరాజు, రాధా, డి కనక శ్రీ, రవి తదితరులు పాల్గొన్నారు.



# సఫాయి కర్మచారీల సమస్యలు పరిష్కరిస్తాం.

● సఫారీ కర్మ చారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**జిల్లా కు విచ్చేసిన సఫారీ కర్మ చారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా ను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా,కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజ్, పిఓ రాహుల్ తో కలిసి అధికారులు, సఫాయి కర్మచారీల సంక్షే మం కోసం పాటుపడుతున్న పలు సంఘాల నాయకులు, ప్రతినిధులతో సోమవారం ఐ డి ఓ సి కార్యాలయం లో సమా వేశం నిర్వహించారు. వావా మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టప డే సఫాయి కర్మచారీల కు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సాయం, బ్యాంకు రుణా లు అందించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య శిభిరాన్ని నిర్వహించి వారికి వైద్య సేవలందించాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయిన్ శుభ్రపరిచే కార్మికుల పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జీతం పెంచడానికి చర్యలు తీసుకో వాలని సూచించారు. ప్రతి ఒక్కరికి కనీస వేతనాలు దక్కేలా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సఫాయి కర్మచారుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంవత్సరంలో నాలుగు సార్లు సఫాయి కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సఫాయి కార్మికుల సంక్షేమానికి అన్ని మండలాల్లో సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నా మన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు భూపతి అప్పారావు మాట్లాడుతూ సెప్టిక్ట్యాంక్ క్లీనింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాలు ఈఎస్ఐ, పీఎఫ్ అమలయ్యేలా చూ డాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్డిఓ విద్యా చందన, డీఎస్పీ రహమాన్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, జిల్లా సంక్షేమ అధికారి అనసూయ, జిల్లా లేబర్ ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

# కొల్లాపూర్ మున్సిపాలిటీ ప్రజలకు మంచి పాలన అందించడమే మా లక్ష్యం

● మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య నాగరాజు



**సీకే న్యూస్ ప్రతినిధి, కొల్లాపూర్:** కొల్లాపూర్ నియోజక వర్గ మరియు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన తర్వాత మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో ప్రజలకు మంచి పాలన అందిచడమే లక్ష్యం గా సోమవారం అందరూ కౌన్సిలర్ ల సహకారంతో ప్రతి వార్డుకు వార్డు ఆఫీసర్ లను నియమించడం జరిగిందనీ మున్సిపాలిటీ చైర్ పర్సన్ రమ్య నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం ఆమె మాట్లాడుతూ వార్డు ఆఫీసర్ తో పాటు ఒక అసిస్టెంట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని వీరు ఇద్దరు అధికారులు ఆ యొక్క వార్డు కౌన్సిలర్ తో సమన్వయం చేసుకొని వార్డులలో ఉండే సమస్యలు తెలుసుకొని పరిష్కారం చేయాలి ప్రతి రోజు వీరికి కేటాయించిన వార్డులలో ప్రజా సమస్య ల పై దృష్టి పెట్టి సమస్య పరిష్కారం అయ్యే వరకు కృషి చేయాలి అని ఆదేశాలు జారీ చేసిన కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య నాగరాజు నిరంతరం ప్రజా సమస్యలపై కృషి చేయాలని వారు ఆదేశించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ధర్మసాగర్ రైతు వేదికలో జన మహాసభ



**సి కె న్యూస్ ధర్మసాగర్ మండలం హనుమకొండ జిల్లా ప్రతినిధి కమలాకర్ జూలై 1:**ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 02న మధ్యహ్నం 2 గంటలకు ప్రత్యేక మహజన సభ ధర్మసాగర్ రైతు వేదికలో ఏర్పాటు చేయనున్నట్లు సహకార సంఘం సిరలో రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘ అధ్యక్షుడు గుండ్రేడ్డి రాజేశ్వర్ రెడ్డే అద్దక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో రైతు బంధు పథకం అమలుపై సభ్యులు రైతులు అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.

# పాల ఉత్పత్తి దారుల సొసైటీ చైర్మన్ గా శ్రీ చుంచు మల్లయ్య ఎన్నిక




**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్**

ఆత్మకూరు (యం) మండలం కోరటికల్ గ్రామంలో పాల ఉత్పత్తి దారుల సోసైటి చేర్మేణ్ గా శ్రీ చుంచు మల్లయ్య గారిని ఎన్నుకోవడం జరిగింది.లి

డైరెక్టర్లుగా:-
:-పన్నాల ఎల్లారెడ్డి
:-కందటి శ్రీనివాస్ రెడ్డి
:-చామకూర వెంకటయ్య
:-చిన్నం ముత్యాలు
:-రంగు మల్లయ్య
:-పెద్దిరెడ్డి సుధలక్ష్మి
:-లగ్గాల శంకరయ్య
:-శ్రీరాముల భవనా ఋషి
:-కట్టెకోల చిన్న యాదయ్య గారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్,మాజీ ఎంపీటీసీ సభ్యులు కందటి అనంతరెడ్డి, మాజీ పాల సంఘం చైర్మన్ శ్రీరాముల భవన ఋషి, బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నరుకుడుబిందెల సైదులు, తాజా మాజీ వార్డు సభ్యులు చుంచు చంద్రయ్య,పాల సంఘం సెక్రటరీ గజ్జెల్లి వినయ్, కురుమ సంఘం అధ్యక్షులు చిన్నం యాదగిరి, పెద్ది రెడ్డి నారాయణ రెడ్డి, గజ్జెల్లి ఎల్లయ్య, లగ్గాల నరేష్, చుంచు బాలరాజు,చుంచు నాగరాజు,చుంచు లక్ష్మయ్య, చుంచు వీరస్వామి, కొమురెల్లి సత్తిరెడ్డి,మబ్బు సోమయ్య ,జిల్లపల్లి నర్సయ్య ఖమ్మంపాటి నర్సయ్య,కోల నర్సయ్య,బస్వ శంకరయ్య,చిన్నం ముత్యాలు ,కోల నర్సయ్య,రంగు సత్యం, లగ్గాల అంజయ్య,గంధశీల మల్లయ్య,బుర్ర మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మిక నాయకులు వత్సవాయి కృష్ణంరాజు కి మాతృవియోగం.

నివాళులర్పించిన ఐ ఎఫ్ టి యు నాయకులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం సింగరేణి కాల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐ ఎన్ టి యు సి) ఏరియా ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజుకి మాతృ యోగం తల్లి నారాయణమ్మ సోమవారం చనిపోయారు, గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్ డి నా సర్ పాషా నారాయణమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు, అదేవిధంగా నారాయణమ్మ మృతి సమాచారం తెలుసుకున్న సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు ఏ మంగీలాల్ మరియు కార్యకర్తలు పివి కాలనీ వారి నివాసంలో నారాయణమ్మ భౌతికకానికి సందర్శించి నివాళులర్పించారు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు, నాగేశ్వరరావు, కే గురు మూర్తి, యు శివరామకృష్ణ, కే నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు,ఐ గోపి, కే నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్స్ డే సందర్భంగా వైద్య అధికారిని సన్మానించిన టీజేయు



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ డే సందర్భంగా తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో వైద్య అధికారి డాక్టర్ విలియం కేరి ని మర్యాదపూర్వకంగా కలిసి.శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీజేయు మండల గౌరవ అధ్యక్షుడు నోముల రవీందర్ రెడ్డి.మండల అధ్యక్షుడు గడ్డం నాగరాజు.మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# 150 మందికి నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి (రామయ్య) జూలై 01:**హుజుర్ నగర్ పట్టణములో ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 69 వ వార్షికోత్సవం సందర్భంగా 150 మంది విద్యార్థులకు ,నోట్ బుక్స్ పంపిణీ చేసిన బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ లు ఉద్దం సింగ్,వినోద్

ఈ సందర్భంగా డిప్యూటీ మేనేజర్ ఉద్దం సింగ్ మాట్లాడుతు విద్యార్థులకు స్కాలర్షిప్ కోసం ఉచిత ఎకౌంటు ఇవ్వబడునని ఎకౌంటు తీసుకోవడం వల్ల చదువు పూర్తయ్యే వరకు ఈ ఎకౌంటు ఉపయోగపడుతుందని

ఉపాధ్యాయులకు పర్సనల్ లోన్ గాని హౌసింగ్ లోన్లు కూడా ఇవ్వబడునని

వార్షికోత్సవం సందర్భంగా తక్కువ వడ్డీరేట్లకు లోన్లు ఇవ్వబడునని

విద్యార్థులకు భవిష్యత్తులో కూడా మా వంతు సహాయ సహకారాలు అందిస్తాం అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు సిబ్బంది వరకాల రాము, పోల గాని వెంకటేశ్, సెక్యూరిటీ వెంకటేశ్వర్లు,చేతు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి.-.అల్లాడి పౌల్ రాజ్




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**స్థానిక ఏఎంసీ కాలనీ నందు మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌల్ రాజ్ పాల్గొని మాట్లాడుతూ..... భారత దేశానికి స్వతంత్ర వచ్చే 75 ఏళ్లు గడుస్తున్న నిరుపేదలు నిరుపేదలగానే మిగిలిపోయారని, 75 ఏళ్లలో పేదల సొంతింటి కలగానే మిగిలిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. భద్రాచల పట్టణంలో నివసిస్తున్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద ప్రజలు అద్దే ఇళ్లలో ఉంటూ పెరిగిన ధరల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం పేదల కు కట్టించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కులమత బేధం లేకుండా నిరుపేదల కు నేరుగా అందించాలని నేటి ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు వర్ల రామకృష్ణ, దేగల రాజు, శాంతిరాజు, సామేలు, రాజు, చీకటి దశమ్ బాబు, నాని హరీష్ కొండ దిలీప్ తదితరులు పాల్గొన్నారు

# వాజేడు లో ప్రభుత్వ వైద్యుల ర్యాలీ



**సి కె న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :**ప్రపంచ వైద్యదినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా వాజేడులో ప్రభుత్వ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం రావడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, అలాగే ప్రతి ఒక్కరు కూడా దోమతెరలు వాడాలని, జనాలకు అవగాహన కల్పించారు. ఇళ్లలోకి మురుగునీరు రాకుండా చూసుకోవాలని ఖాళీ టైర్లు, కూలర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఇలాంటి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందడానికి అవి ఆవాసాలుగా పనిచేస్తాయని వాటిలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని డాక్టర్ మహేందర్ తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని వీటిని వినియోగించుకోవాలని డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులు ఈ సీజన్లో ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి కాబట్టి జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాసుపత్రిలో రక్తపరీక్ష చేయించుకోవాలని డాక్టర్ మధుకర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్ మరియు డాక్టర్ మధుకర్, సూపర్వైజర్స్, ఏఎన్ఎం మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల పాఠశాలలో దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి




**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి (రామయ్య) జూలై 01:**హుజూర్నగర్ మున్సిపాలిటీలో బాలికల ఉన్నత పాఠశాలలో దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి స్థానిక వార్డు కౌన్సిలర్ గాయత్రి భాస్కర్ గారితో కలిసి పాల్గొని పాఠశాల కి కావలసిన మౌలిక వసతుల నీ అడిగి తెలుసుకున్నారు

అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా సంవత్సరం ఆరంభంలోనే పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ అందజేస్తుందని నాణ్యమైన విద్య అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు అని తెలపడం జరిగింది.

అలాగే హుజూర్నగర్ నియోజకవర్గం లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా తీసుకు వస్తున్నటువంటి గౌరవ అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు

పాఠశాలకి అవసరమైన మౌలిక సదుపాయాలు, శానిటేషన్ నీ అందిస్తామని వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి గారు తెలిపారు. కార్యక్రమంలో 21 వార్డ్ కౌన్సిలర్ గాయత్రి భాస్కర్, ప్రధానోపాధ్యాయులు లతీఫ్ , వ్యాయామ ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి అధ్యాపక బృందం జయప్రద తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ వితరణ.



**ఖమ్మం / తల్లాడ జులై 1 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్** తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి గారి ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద మహిళకు కుట్టు మిషన్ వితరణ. ఈ సందర్భంగా అధ్యక్షులు వారు మాట్లాడుతూ నిరుపేద మహిళల తుమ్మలపల్లి రామ సీత మిట్టపల్లి గ్రామం, జీవనోపాధి కొరకు జీవనోపాధి కొరకు జవాజి నగేష్ , మిట్టపల్లి నరసింహారావు . సంయుక్తంగా స్పాన్సర్ చేశారు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రెటరీ కర్నాటి లక్ష్మారెడ్డి , క్యాబినెట్ డిసి మిట్టపల్లి నరసింహారావు, సెక్రటరీ నంబరు కనకదుర్గ ప్రసాద్, ఎలెక్ట్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు, ఎలక్ట్ సెక్రటరీ కటికి వెంకటేశ్వరరావు, ఎలెక్ట్ ట్రెజరర్ సేలం వెంకటరెడ్డి, రాయల గోవిందరావు, మొదలగువారి పాల్గొన్నారు.

## గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడుని అభినందించిన డాక్టర్ వంగపల్లి.




**సి కే న్యూస్ ఆలేరు నియోజకవర్గం ప్రతినిధి (సందెన శంకర్) జూలై 1,** తెలంగాణ రాష్ట్ర గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ ను సోమవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలోని వారి కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందించి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని బహుకరించారు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కాచారం దేవాలయ ఆశ్రమ వ్యవస్థాపకులు భక్తి రత్న అవార్డు గ్రహీత డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి. సమావేశంలో పాల్గొన్న సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జనగామ స్వామి గౌడ్ ను కూడా సన్మానించారు డాక్టర్ వంగపల్లి. ఈ సందర్భంగా డాక్టర్ వంగపల్లి మాట్లాడుతూ కాచారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి భక్త బృందం ముఖ్య నాయకుడు యువకుడు సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు నక్క కృష్ణను అభినందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా యువతను ఆకర్షించే విధంగా యువ నాయకుడికి పట్టం కట్టడం పలు స్వచ్ఛంద సేవా సంస్థలు నెలకొల్పి పేద ప్రజలకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం ముఖ్యంగా సర్దార్ పాపన్న విగ్రహాలను పలు కేంద్రాల్లో స్థాపించడానికి ముఖ్య కారకుడు పంజాల వెంకట్ గౌడ్ ఇంకెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి భక్త బృందం సభ్యులు గౌడ సంఘం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ వైద్య దినోత్సవం



**చౌటుప్పల్. సి కే న్యూస్** జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా త్రినిటీ విద్యాసంస్థలు నిర్వహించిన అపూర్వ కార్యక్రమంలో 100 మంది విద్యార్థిని విద్యార్థులు మేము సైతం వైద్యులుగా సమాజానికి సేవలు అందిస్తామని, వైద్యుల వేషధారణలో ప్రముఖ నేచురోపతి కే వై రామచంద్ర రావు,డాక్టర్ పద్మ,డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి,డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి లాంటి విద్యావేత్తలు పుర ప్రముఖులు, తల్లిదండ్రుల ముందు విద్యార్థులు ప్రతిజ్ఞ పూనారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..మానవులు జంతు కళేబరాలను భుజించడం మానవ సంస్కృతి కాదని, ప్రకృతి ప్రసాదించిన ఆహారాన్ని ఆస్వాదించాలని కోరారు.

డాక్టర్ పద్మా మాట్లాడుతూ మానవ సంబంధాల విలువలను అమ్మానాన్న పిలుపుల మాధుర్యాన్ని, వాటిలోని ప్రేమను వివరిస్తూ విద్యార్థినీ విద్యార్థులకు సంస్కారా వంతమైన జీవితాన్ని ప్రేమ అనురాగాలతో కూడిన సమాజాన్ని స్థాపించాలని సమాజాన్ని సంస్కరించాలని ఆ దిశగా త్రినిటీ విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు బాధ్యత వహించడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ఆహ్వానితులను ఉద్దేశించి మాట్లాడుతూ త్రినిటీ విద్యాసంస్థలు ప్రపంచ విషయాలపై అవగాహన కల్పిస్తూ చౌటుప్పల్ పురపాలక సంఘంలో అతి ఉన్నత విద్యాసంస్థగా ఎదగడం గొప్ప విషయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు,ముఖ్య వక్త డాక్టర్ కే వై రామచంద్ర రావు,డాక్టర్ పద్మ, గాంధీ గ్లోబల్ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి,కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి,మండల అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య, మహిళా మండలి అధ్యక్షురాలు రాధిక, కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు డైరెక్టర్ డాక్టర్ ఉజ్జీని మంజుల, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.450.00కోట్లు.

- కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి మరో రూ.72.86కోట్లు మంజూరు.
- నగరాలకు ధీటుగా అభివృద్ధి చేసి చూపెడతా.
- నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తున్న మంత్రివర్గం.
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో త్రాగునీటి సమస్య పరిస్కారంకోసం రూ.128.48కోట్లు, విద్యానగర్ కాలనీలో డ్రైన్ల నిర్మాణానికి రూ.4కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రులతో శంకుస్థాపన చేసుకున్న అనతికాలంలో ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి రూ.450కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.72.86కోట్ల మంజూరు లభించిందని ఇది కొత్తగూడెం నియోజకవర్గ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో సోమావారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబందించిన వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు అనిశెట్టిపల్లి జాతీయ రహదారి 930పి నుంచి పాల్వంచ వరకు సర్వారం సర్వారం, రామవరం, జగన్నాధపురం మీదుగా 30వ జాతీయ రహదారిని కలుపుతూ 25కిలోమీటర్ల ఔటర్ రింగు రోడ్డు రహదారి నిర్మాణానికి రూ.450కోట్లు మంజూరయ్యాయని, ఈ రహదారి నిర్మాణంతో జంట పట్టణాలకు ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరనుందని అన్నారు. భద్రాచలం పట్టణం వద్ద విజయవాడ- జగ్దల్పూర్ 30వ జాతీయ రహదారిని సుమారు 7కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.50కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఎదురుగా పాదచారులు దాటుటకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.64కోట్ల మంజూరు లభించిందని, అదేవిధంగా విజయవాడ -జగ్దల్పూర్ 30వ జాతీయ రహదారిలో కిన్నెరసాని నదిపై వంతెన నిర్మాణానికి రూ.20.22 కోట్లకు మంజూరు లభించిందని తెలిపారు. మంజూరైన పనులు పూర్తయితే కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు నగరాలకు ధీటుగా అభివృద్ధి సాదిస్తుందని తెలిపారు. గడిచిన ఏడునెలల్లోనే కొత్తగూడెం నియోజకవర్గానికి వివిధ పథకాల రూపంలో కోట్లాది రూపాయల నిధుల వర్షం కురిసింది, ఇదే స్పూర్తితో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు శాశ్వత పరిస్కారం లబించే విదంగా శక్తివంచన లేకుండా కృషిచేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మంత్రివర్గం సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తోందని తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్ కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, కొండా వెంకన్న, టిడిపి జిల్లా నాయకులు నల్లమల వేణు, శరత్, డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సిపిఐ జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నూనావత్ గోవిందు, యూసుఫ్, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి......





- జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే

**సి కే న్యూస్ ( సంపత్) ఆగస్టు 01:**ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి 82 ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించాలని సూచించారు.ఇందులో రెవెన్యూ శాఖ 51, వ్యవసాయ శాఖ 3, ల్యాండ్ రికార్డ్ శాఖ 3, మునిసిపాలిటీ 7, గ్రామీణ అభివృద్ధి శాఖ 5, పంచాయితీ శాఖ 3, విద్యాశాఖ 3, జిల్లా పరిషత్ 2, సివిల్ సప్లై, పోలీసు, ఇరిగేషన్, విద్యుత్, ఉపాధి కల్పన శాఖలు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి.ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్షా లోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ ఎ.ఓ. జగన్మోహన్ ప్రసాద్, జిల్లా అధికారులు ఉన్నారు.

# మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలి.

- స్థానిక కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 01,**స్థానిక కొత్తగూడెం క్లబ్ వేదికగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా స్థానిక లికొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొనీ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఇటువంటి జాబ్ మేళాలు ఉపయోగించు కొని తద్వారా అందినటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు నిరుద్యోగ యువతను కోరారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నటు వంటి ఇటువంటి ఆలోచనలను సాదరంగా మేము ఆహ్వానిస్తున్నామని నిరుద్యోగ యువత కోసం ఈ యొక్క ప్రాంతంలో కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి ఇక్కడ ఉన్నటువంటి నిరుద్యోగ యువత ఒక దారి చూపించాలని ఈ సందర్భంగా వారు కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు.

# మహా రక్తదాన శిబిరం కరపత్రాన్ని ఆవిష్కరించిన వెన్ రెడ్డి రాజు




**చౌటుప్పల్. సీకే న్యూస్ .**ఆయాన్స్ భార్గవ్ సేవా ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 30 బుధవారం రోజున మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్త దాతలను అభినందించే కార్యక్రమానికి నిర్వాహకులు శ్రీకారం చుట్టారు.ఈసందర్భంగా మహారక్తదాన శిబిరం కరపత్రాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ ఆయాన్స్ భార్గవ్ సేవాట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందించి ముందుముందు ఇలాంటి కార్యక్రమాలను విజయవంతంగా చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకులు బోదుల మురళి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి రక్తదానాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు.నేటి సమాజంలో నిత్యవసర వస్తువులన్నీ కల్తీ అవుతున్నాయని అత్యవసరమైన రక్తదానం కూడా కల్తీ అయితే ఎలా అని అన్నారు. రక్తం మానవ శరీరంలో మాత్రమే ఉత్పత్తి అయ్యేది దానికి మనకు మనం మాత్రమే రక్తదానం చేయాలని సూచించారు.ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజ్వాన్, షకీల్ ,శ్రీను,శివ,కార్తీక్, శ్రీకాంత్,వెంకట్,విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



కత్రినా కైఫ్ సూర్య-ముద్దులు మరియు మెరుస్తున్న చిత్రాలు

# దిశా లవ్ లవ్ లబ్ డబ్



దిశా పటానీ ఇటీవల మూడు కారణాలతో నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలుస్తోంది. ఒకటి తన కొత్త స్నేహితుడు అలెక్స్ ఇలిక్ తో జోరుగా షికార్లు చేస్తూ దొరికిపోయినప్పుడు... రెండోది ప్రభాస్ కల్కి చిత్రంలో నటిస్తూ నెటిజనులను కవ్వించినప్పుడు.. మూడోది అగ్గి రాజేసే ఫోటోషూట్లతో మతులు చెడగొట్టినప్పుడు.

ఇప్పుడు ఈ మూడో కారణం ఇప్పుడు మళ్లీ చర్చకు వచ్చింది. దిశా పటానీ తాజాగా ఓ అందమైన ఫోటోగ్రాఫ్ ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోగ్రాఫ్ లో దిశా ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. అంతేకాదు.. దిశా ధరించిన డిజైనర్ టాప్ ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దీనిని చూడగానే.. బ్లాక్ ఫ్రాక్ లో గట్సీ గా ఫోజులిచ్చింది అంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. మరోవైపు లవ్ సింబల్స్ ని పెర్ల్ తో డిజైన్ చేసి తన ఫ్రాక్ కి జోడించిన తీరు డిబేటబుల్ గా మారింది. దిశా ఈ లుక్ లో ఎంతో స్పెషల్ గా కనిపిస్తోంది. మునుపటి కంటే హాట్ గా కూడా కనిపిస్తోందని ఫ్యాన్స్ కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. దిశా లవ్ లవ్ లబ్ డబ్! అంటూ ఒక అభిమాని ఈ డిజైనర్ లుక్ పై స్పందించాడు.'లోఫర్' చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది దిశాపటానీ. చాలా గ్యాప్ తర్వాత ప్రభాస్ 'కల్కి' చిత్రంలో నటించే అవకాశం అందుకుంది. ఆ సినిమా తనకు పాన్ ఇండియాలో గేమ్ ఛేంజర్ గా మారుతుందని దిశా భావిస్తోంది. ఇంతకుముందు ప్రభాస్ తో కలిసి దిశా విమాన ప్రయాణానికి సంబంధించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. ఆ ఇద్దరి స్నేహం ఎంతగానో ఆకర్షించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... దిశా పటాని చివరిగా 'ఏక్ విలన్ రిటర్న్స్'లో అర్జున్ కపూర్, జాన్ అబ్రహం, తారా సుతారియాలతో కలిసి నటించింది. తదుపరి నాగ్ అశ్విన్ యాక్షన్ డ్రామా 'కల్కి 2898–%ూణ%'లో దీపికా పదుకొనే, దుల్కర్ సల్మాన్ – అమితాబ్ బచ్చన్‌లతో కలిసి కనిపిస్తుంది. దిశా పటానీ ఇటీవలే విడుదలైన సాగర్ అంబ్రే –పుష్కర్ ఓజా యాక్షన్ డ్రామా యోధాలోను కనిపించింది.

# పిక్ టాక్ : పిచ్చెక్కించే లేడీ విలన్

ఉత్తరాది బుల్లితెర ప్రేక్షకులకు నాగిని సీరియల్ ద్వారా సుపరిచితురాలు అయిన ముద్దుగుమ్మ మౌనీ రాయ్. సుదీర్ఘ కాలంగా హిందీ ప్రేక్షకులను అలరిస్తున్న మౌనీ రాయ్ ఇటీవల బ్రహ్మాస్త్ర సినిమాలో లేడీ విలన్ గా నటించి సర్ ప్రైజ్ చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అలరించింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా ఏళ్లు అవుతున్నా కూడా అందాల ఆరబోత విషయంలో మౌనీ రాయ్ ఏమాత్రం తగ్గలేదు. పై పెచ్చు ఈ మధ్య కాలంలో ఈమె సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలు కుర్రకారుకు కూడా పిచ్చెక్కించే విధంగా ఉన్నాయి అనడంలో సందేహం లేదు.

తాజాగా మరోసారి బ్లాక్ డ్రెస్ లో అందాల నడుము నాభి ని చూపిస్తూ క్లీ వేజ్ షో తో పిచ్చెక్కించే విధంగా ఉన్న ఈమె అందంకు ఎంతటి వారు అయినా ఫిదా అవ్వాల్సిందే. అసలు ఈమె అందుకు హీరోయిన్ స్థాయి ఆఫర్లు రావాలి అంటూ కొందరు కామెంట్స్ చేస్తే ఈమె అందంను సద్వినియోగం చేసుకోవడంలో మేకర్స్ విఫలం అంటూ మరి కొందరు అంటున్నారు.మొత్తానికి తాజా ఫోటోలు చూసి పిచ్చెక్కి పోతుంది అంటూ కుర్రకారు తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందాల విందు చేస్తున్న మౌనీ రాయ్ ముందు ముందు మరింతగా వెండి తెర మరియు ఓటీటీ స్క్రీన్ పై రెచ్చి పోవడం ఖాయం అని కూడా టాక్ వినిపిస్తుంది.





ప్రియమణి యొక్క అద్భుతమైన ఫ్యాషన్ ఫోటో డిలైట్